నవ్య, ఏప్రిల్ 23, 2008

# వలయం

ఆ రోజే వేణు ప్రయాణం.

వెళ్తూ వెళ్తూ వేణు చెప్పిపోయాడు "కోటమ్మని పిలిచి మాట్లాడండి. ఎట్లాగైనా సరే ఆమెని ఒప్పించి సరోజినిని ఢిల్లీ పంపించే బాధ్యత మీదే"

బాధ్యత! ఈ మాట తలచుకునేసరికి నవ్వొచ్చింది.

తనకు ఇంటర్‌లో ఎం.పి.సి. సీటు తెప్పించటం నా బాధ్యత. దావణగెరెలో ఇంజనీరింగ్‌లో చేర్పించటం నా బాధ్యత. ర్యాగింగ్‌తో ఏడుస్తూ పారిపోయివస్తే తీసుకుపోయి తోటిపిల్లల్తో, కాలేజీ అధికారులతో మాట్లాడి సమర్థించటమూ నా బాధ్యతే. స్ట్రైక్ మూలంగా పోలీసులు కస్టడీలోకి తీసుకుంటే – రాత్రికి రాత్రి లారీలు మారుతూ అక్కడిదాకా ప్రయాణం చేసి ఆ వూరు పోయి విడిపించుకురావటమూ నా బాధ్యత. సివిల్ ఇంజనీరింగ్ చెల్లని నాణెంగా తయారయితే, ఢిల్లీలో ఉద్యోగం సాధించిపెట్టటమూ నా బాధ్యతే.

దారినబోయే పిల్లని రైలు ప్రయాణంలో చూసి, "ఆమే నాకు పెళ్లాం కావాలి" అంటే, ఆ పెళ్ళి జరిపించటమూ నా బాధ్యతే. అత్తమామలు అమ్మానాన్నని చులకన చేస్తుంటే తాను మౌనం వహించవచ్చు. ఆ మౌనాన్ని సహించటం మాత్రం నా బాధ్యత. "మీ కోడలు అపర్ణ ఆరోగ్యం బాగా లేదు. గర్భవతి. వాళ్ళవాళ్లెవరూ వచ్చి సహాయ పడేవాళ్లు లేరు" అంటే అందుకుగాను కోటమ్మని ఒప్పించి ఆమె కూతుర్ని ఢిల్లీ పంపించటమూ నా బాధ్యత!

తలనెప్పి.... కణతలు నొక్కుకుని కళ్లు మూసుకున్నాను. రంగులు వెలార్చుతూ తిరుగుతున్న దిక్చక్రంలో మరణించిన నా భార్య సీత రూపం కనిపిస్తోంది.

సరే కోటమ్మని ఒప్పించి, సరోజినిని ఢిల్లీ పంపితే అపర్ణకి అబార్షన్ జరిగింది. అపర్ణకీ సరోజినికీ సయోధ్య కుదరలేదు. పదిహేనేళ్ళ సరోజిని అపర్ణ దాష్టీకం చేసిందనీ, కొడుతున్నదనీ ఫిర్యాదు. కోటమ్మ మూగ రోదనతోనే పిల్లని తెచ్చేసుకుంది. తానేదో అనబోతే, "మీరా అలగాజనాన్ని వెనకేసుకొస్తారేమిటి మామయ్యా" అని అననే అన్నది అపర్ణ. వేణు అవునన్నట్లు చూశాడు. వాళ్ళిద్దరి దృష్టిలో కోటమ్మనీ, సరోజినినీ దబాయించకపోవటం నా బాధ్యతారాహిత్యం. ఆ విషయంలో నేనొక పెద్ద 'ఫెయిల్యూర్! కోటమ్మావాళ్ళు అలగాజనమా?! సీతా, కోటమ్మా తల్లీతోడుగా ఉండేవాళ్లు. కులప్రసక్తీ, అంతస్తుల ప్రసక్తీ లేకుండా తమ కుటుంబాలు రెండూ ఎంత అన్యోన్యంగా ఉండేవో అపర్ణకి మాత్రం తెలీదూ? ఇన్నాళ్లకిన్నాళ్లకి వాళ్లని వేరుచేసి ఈసడించటం, నన్నేమో అంతమాట అనటం? ఎక్కడికి పోతోందీ తరం? తమ పొట్టా, తమ సుష్టూ అన్న స్వప్రయోజన మార్గంలోకి నడుస్తోందా?! ఏమో?!

ఆరేడేళ్ళనాటి మాట ఇదంతా.

కొన్ని కొన్ని బాధ్యతలు ఎంత జాగ్రత్తగా, శ్రద్ధతో నిర్వహించినా ఆవేదననీ, నిరాశనీ మిగులుస్తాయి – ఇలాగే!

+ + +

కొన్ని బాధ్యతలు  ఇతరుల కోరికమేరకు చేసినా, ఒకరకమైన తృప్తినీ, ఆనందాన్నీ మిగులుస్తాయి. చెప్తాను.

మా పెద్దమ్మ మనవడు గోపాలం సంగతే చెప్తాను. అతనూ, అతని భార్య వరలక్ష్మి – వాళ్ళకి నేనంటే గౌరవం. గోపాలం బ్యాంక్ ఆఫీసర్. వరలక్ష్మి టీచర్. శిరీష, రఘు సంతానం. శిరీషకి ఫార్మా కంపెనీలో ఉద్యోగం. రఘు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి.

శిరీష పెళ్ళికి హైదరాబాద్ వెళ్ళాను.

"మీరు ముంబై నుంచీ రాగలరో లేదోనని చాలాసార్లు అనుకున్నాం. కంపెనీ బాధ్యతలు. ఈడీ ఉద్యోగం కదా" అని ఎంతో ఆనందించారు. "ఇటు శిరీషకో మంచి సంబంధం చూశారు, అటు మా రఘుని ఓ గాడిలో పెట్టారు. మీరు చేసిన సహాయం నిజంగా"..... అని వరలక్ష్మి ఏదో అనబోతుంటే "సరేలే అమ్మా... అన్నీ మంచిగా జరగిపోతాయ్. పెళ్ళివారొచ్చారుగా" అంటూ సంభాషణ మళ్ళించాను, ఆమె ప్రశంసని సున్నితంగా వారిస్తూ.

ఇంతలో పెళ్ళికొడుకు తల్లిదండ్రులు రాఘవరావ్, సుందరీ నమస్తే చెప్తూ వచ్చారు. రాఘవరావ్ అన్నాడు "సంతోషం సార్. మీ రెఫరెన్స్ వలన మాకు మంచి సంబంధం కుదిరింది."

నేను చిరునవ్వు నవ్వి ఊరుకున్నాను.

రఘు వచ్చి, నమస్తే చెప్పి నాకు కేటాయించిన గదివైపు తీసుకువెళ్ళాడు. ఎవరి పనుల్లో వాళ్ళు నిమగ్నమయ్యారు.

నాలుగంతస్థులు ఏ.సీ. కళ్యాణమంటపం కళకళలాడుతోంది. స్టీరియో సంగీతం మంద్రంగా సాగుతోంది. పడతుల సింగారింపులతో పచ్చపచ్చని శోభలు వెలారుస్తోంది హాలు. నేను నా గదిలో ఫ్రెష్ అవటానికి స్నానుకున్నాను.

గోపాలం కుటుంబం నా ఆలోచనల్ని ఆక్రమించింది.

రెండేళ్ల క్రితం –

ఒక రోజు గోపాలం ఫోన్ చేశాడు. "మా వాడి పరిస్థితేం బాగాలేదు బాబాయ్. బియస్సీ కంప్యూటర్స్ అయింది. అక్కడా ఇక్కడా ఏవేవో మార్కెటింగ్ జాబ్స్ చేస్తున్నాడు, వదిలేస్తున్నాడు. కుదురు లేదు. కాస్సేపు ఎంసిఏ చేస్తానంటాడు. కాస్సేపు ఎంబిఏ అంటాడు. వీటి మధ్య ఏదో ఢిల్లీ ఇంటర్వ్యూ అంటాడు. ఎటూ అక్కడిదాకా వెళ్తున్నాకదా ఆగ్రా, జైపూర్ చూసొస్తానని మొన్న పదివేలు పట్టుకెళ్ళాడు. వీణ్ణీసారి మీ దగ్గరికి ముంబై పంపుతాను. కౌన్సిలింగ్ చేసి దారిలో పెట్టాలి. వాడికో తెరువు చూపే బాధ్యత మీదే!" – ఇదీ సారాంశం.

బాధ్యత! నవ్వుకున్నాను.

ఆ తర్వాత రఘు వచ్చాడు. కూర్చోపెట్టి బ్రెయిన్ వాష్ చేశాను. నిదానంగా, "అసలు నీకే ఎందుకు ఫలానా ఉద్యోగం ఇవ్వాలి? ఆ ఉద్యోగానికి కనీసం నువ్వూ అర్హుడవేనని చెప్పుకోవటానికి మీ దగ్గరున్న సాధనాలేమిటి?" వంటి ప్రశ్నలు వేశాను. ఆలోచనలో పడ్డాడు.

నాలుగు రోజుల తర్వాత సలహా అడిగాడు. చెప్పాను. ఫలానా కోర్స్ చేసి నాకు చెప్పమని. ఆర్నెల్లు తిరిగేసరికీ, ఆ కోర్స్‌లో ప్రథమశ్రేణిలో పాసయి ఫోన్ చేశాడు. పూనెలో ఒక మిత్రుడికి రిఫర్ చేశాను. ఇవాళ రఘు ఒక మంచి ఉద్యోగి. జీవితంలో ఒక స్థాయికి వచ్చాడు.

ఇదీ నాకు తృప్తి. వాళ్ళకేమో నా పట్ల ప్రత్యేక గౌరవం. నేను చేసిన సహాయం స్వల్పం. అది ఫలితాన్నిచ్చింది.

అలాగే, శిరీష పెళ్ళి విషయంలోనూ నాది మాటసాయమే. గోపాలం పిల్ల సంగతి రాఘవరావ్ గారికీ, రాఘవరావ్‌గారి కొడుకు సీతారాం సంగతి గోపాలం వాళ్ళకీ చెప్పాను. రాఘవరావ్ గవర్నమెంట్‌లో పెద్ద ఉద్యోగి. సుందరి కాలేజ్ ప్రొఫెసర్. సీతారాం బిటెక్, ఎంబిఏ. హైదరాబాద్‌లో మంచి ఉద్యోగం. పెళ్లి సంబంధం ఇతర వ్యవహారాలన్నీ వాళ్ళకి వాళ్ళే మాట్లాడుకున్నారు. ఔననుకున్నారు.

నిమిత్తమాత్రుడినే అయినా నాకు గౌరవమూ, మర్యాదా దక్కినై.

శిరీష పెళ్ళి ఘనంగా జరిగింది. నేను ముంబై చేరాను.

\+ \+ \+

రెండు నెలలు గడిచాయి.

ఒక రోజు రాత్రి గోపాలం ఫోన్ చేశాడు. "రఘు మరో కంపెనీకి మారాలనుకుంటున్నాడు. ఆ కొత్త కంపెనీ అధికారి – అరుణాచలంగారు మీకు బాగా తెలుసుట. ఆయనకో మాట చెప్పాలి మీరు. ఆయనైతే మంచి ప్యాకేజ్ ఆఫర్ చేసే వీలుందిట. ఎలాగైనా మనవాడికి హెల్ప్ చేసే బాధ్యత మీదే బాబాయ్" అంటూ విషయం చెప్పాడు.

బాధ్యత! నవ్వొచ్చింది. "సరే చూద్దాంలే రఘుని వివరాలు చెప్పమను" అని ఫోన్ పెట్టేశాను. అభివృద్ధి పథంలో సాగుతోంది యువతరం. కానీ వాళ్ల అనేకానేక బాధ్యతల్ని వారి వెనుకతరం వారు స్వీకరించాలి.

మరి మా తరం? అదొక ప్రత్యేకమైన తరం. ముప్ఫై ఏళ్ళనాడే తండ్రి ఉండి కూడా కుటుంబంలో సంపాదనాపరుడిగా, ఏకైక పుత్రుడిగా అన్ని బాధ్యతల్నీ నేనే స్వీకరించాల్సి వచ్చింది. చెల్లెళ్ల పెళ్లి పేరంటాలూ, తల్లిదండ్రుల సంరక్షణాభారం అన్నీ నా బాధ్యతలే అయినై, అవన్నీ నెరవేర్చి... ఇదిగో ఇలా.... ఈ స్థితికొచ్చాను.

తర్వాత నాలుగు రోజులకి పూనే నుంచీ రఘు వచ్చాడు. నేను వివరాలు తెలుసుకుని అరుణాచలంతో మాట్లాడాను.

రఘు ఆ కంపెనీలో చేరాడు.

ఆరేడు నెలలు గడిచినై.

ఆదివారం సాయంత్రం.....

నేనుండే గ్రాంట్ రోడ్ నుంచీ లోకల్ ట్రైన్‌లో చర్చ్‌గేట్‌లో దిగి, కుడివైపు పేవ్‌మెంట్ మీద మెరైన్ డ్రైవ్ వైపు నడుస్తున్నాను. పనేమీ లేదు. కాలక్షేపం నడక.

సెల్ మ్రోగింది. విండ్సర్ ఛటావ్ ముందు ఆగి ఫోన్ చూశాను. అటువైపు నుంచీ గోపాలం "అదివారం కదా అని ఫోన్ చేస్తున్నాను. ఖాళీగా ఉన్నారా? మాట్లాడవచ్చా" అంటూ మొదలెట్టి పదిహేను నిముషాలు మాట్లాడాడు. చివరికి అతని కోరిక, "వచ్చే వారం వీలుచూసుకుని మీరు హైదరాబాద్ రావాలి బాబాయ్. మనమీ విషయాలు వివరంగా మాట్లాడుకోవాలి". ఫోన్ ఆఫ్ అయింది.

మనస్సులో బాధతో, మాటల్లో ఉద్వేగంతో గోపాలం చెప్పిన దాని సారాంశం ఇదీ; రాఘవరావ్, సుందరీ, సీతారాం - ముగ్గురూ డబ్బు మనుషులు. శిరీషని వేధిస్తున్నారు. వాళ్ళకి భేషజాలూ, ఆడంబరాలూ హెచ్చు. పొరపాటున నిన్ను తెచ్చుకున్నాం. సాఫ్ట్‌వేర్ పిల్లని చూసుకుని ఉండాల్సింది అని అత్తమామలు, ఇద్దరం కలిసి ఫారిన్ పోయుండేవాళ్లమని సీతారాం టీజింగ్. అతనికి జల్సాలంటే ఇష్టం. ఎప్పుడూ విహారయాత్రలూ, రిసార్ట్స్‌లో పార్టీలూ.... వేలకి వేలు ఖర్చు. పదిలక్షలు కావాలి పట్టుకురమ్మని పుట్టింటికి పంపించారు శిరీషని. ఆమెకిప్పుడు నాలుగోనెల ప్రెగ్నెన్సీ.

నా మనసంతా కలచినట్లయింది. వాతావరణం మారింది. గాలి దుమారం మొదలైంది. ముందుకేం వెళ్లేదీ? వెనక్కి తిరిగి గబగబా అడుగులు వేస్తూ చర్చ్‌గేట్ స్టేషన్లో పడ్డాను. ఖాళీ బెంచీ మీద కూచున్నాను.

జనసందోహం. నగర ఘోష. ఒకటే శబ్ద కాలుష్యం.

మనుషులూ, తత్వాల గురించి ఒకపక్క బుర్రలో ఆలోచన సాగుతోంది.

జవాబు ఉండీలేనట్లుగా శతసహస్ర ప్రశ్నలు.

శిరీష కాపరం ఇలా కావటానికి నేనెంతవరకూ బాధ్యుణ్ణి?

ఉలిక్కిపడ్డాను. నేను చేసిందేముంది? ఏదో పనిమీద వెళ్తే గవర్నమెంటాఫీస్‌లో పరిచయమైనాడు రాఘవరావ్. కొడుక్కి సంబంధాలేమైనా ఉంటే చెప్పమన్నాడు. చెప్పాను. గోపాలంకీ ఆ రిఫెరెన్స్ ఇచ్చాను. అంతేకదా?

ఆ సంఘటనల పునశ్చరణ మనసుకి ఊరట నిచ్చింది.

దీర్ఘంగా శ్వాస తీసుకుని, వెనక్కి వాలి రిలాక్సయ్యాను. వచ్చేపోయే ట్రైన్స్‌నీ, జనాన్నీ చూస్తూ కూచున్నాను.

సెల్ మోగింది. ఆన్ చేశాను. రాఘవరావ్. "చెప్పండి" అన్నాను విష్ చేస్తూ.

"చెప్పేందుకు చాలా ఉన్నాయ్‌గానీ, మా సీతారాంకి భలే సంబంధం చెప్పారండీ బాబూ...." అని ఎత్తుకోవటమే దూకుడుగా ఎత్తుకుని, "ఆ పిల్లకి వేపకాయంత వెర్రి మూర్తిగారూ.... ఏ మాటతో మందలించినా - గృహహింస అంటూ బ్లాక్‌మెయిలండీ బాబూ.... వివరాలు మాట్లాడుకుందాం గానీ, మీరోసారి వీలైనంత తొందరలో హైదరాబాద్ రండి. ఎంతకాదన్నా-మీరు వాళ్ళ బంధువూ, మా శ్రేయోభిలాషీ కదా... మమ్మల్నీ న్యూసెన్స్ నుంచీ బయటపడేసే బాధ్యత మీరే తీసుకోవాలి....."

'బాధ్యత!' బాగానే వెంటాడుతోంది నన్ను!

హోటల్లో భోజనం ముగించుకుని ఇల్లు చేరాను. సీత చనిపోయిన తర్వాత ఈ ఆరేళ్లనుంచీ ఇదే దినచర్య. హోటల్- ఆఫీస్, హోటల్-ఇల్లు! సత్రం భోజనం, మఠం నిద్ర అన్నట్టు యాంత్రిక జీవనం. చక్రనేమిక్రమం. నిద్రకు ఉపక్రమించ బోతుండగా వేణు ఫోన్.

కుశలప్రశ్నల తర్వాత, "మీ కోడలు మాట్లాడుతుందిట" అని ఆగేడు. క్షణం విరామం. అపర్ణ లైన్లోకొచ్చింది. "మీ ఆరోగ్యం బాగుంది కదా" అని మొదలెట్టి "మా బాబాయి కూతురు లలిత తెలుసు కదా?" అంటూ కొనసాగించింది. "దానికి సంబంధాలు చూస్తున్నారు. సాఫ్ట్‌వేర్ పిల్లే. ఉద్యోగంలోనే ఉంది. హైదరాబాద్‌లోనే. లలిత మన హరికి తగిన పిల్ల. చక్కటి సంబంధం. ప్రపోజ్ చెయ్యమని చెప్పాను మా బాబాయ్‌కి. ఆ పిల్ల మన కుటుంబంలోకి రావాలని నా కోరిక మామయ్యగారూ. మరిదిని ఒప్పించే బాధ్యత మీదే. మేం హరితో మాట్లాడుతూనే వున్నాం కానీ అతను సైలెంట్‌గా ఉన్నాడు."

ఫోన్ ఆగింది.

నా ఆలోచనలు హరి మీదికి మళ్ళినై. సీత పోయిన మరుసటి సంవత్సరమే యు.యస్. వెళ్ళాడు హరి. మధ్యలో ఒక్కసారే వచ్చాడు. పెళ్లి గురించి వాడి ఆలోచనలేమిటో తెలీవు. నేనుగా ఎప్పుడూ ఆ విషయం ప్రస్తావించలేదు. ఇప్పుడు అపర్ణ ఆ ప్రసక్తి తెస్తోంది. అదీ నా 'బాధ్యత'గా నవ్వొచ్చింది.

బంధువుగా, శ్రేయోభిలాషిగా నేను నిర్వహించిన శిరీష వ్యవహారం అలా పరిణమించింది. ఇప్పుడిది నా కుటుంబ 'బాధ్యత'!

ఆలోచనల్లోనే నిద్ర తేలిపోయింది.

సోమవారం, ఉదయం ఏడున్నర. నా మార్నింగ్ వాక్ పూర్తి చేసుకుని లోపలికొస్తుంటే - ఫోన్!

హరి! యు.యస్. వాతావరణం గురించీ, ఉద్యోగం గురించీ, నా ఆరోగ్యం గురించీ సాగినై మాటలు. హరి చాలా నెమ్మదిగా నింపాదిగా మాట్లాడుతూ ఉంటాడు. వాడి సహజశైలిలో అలాగే చెప్పాడు.

"మంచి సంబంధం చూడండి నాన్నా. ఒక్క మాట. వదినా వాళ్ళ లలిత కాకుండా! అన్నయ్యా వదినా నాలుగు నెలల నుంచీ ఆమె గురించి చెప్తూనే వున్నారు. నిన్న రాత్రి కూడా చాలాసేపు మాట్లాడారు. కానీ, నాకిష్టం లేదు. ఆ సంబంధం వద్దని ఎలాగోలా వాళ్ళకి చెప్పే బాధ్యత కూడా మీదే!" ఇటు హరి ఫోన్ ఆగుతుండగానే మళ్ళీ ఫోన్!

ఈసారి న్యూయార్క్ నుంచీ మేనకోడలు వనజ "మామయ్యా మమ్మల్నీ ఇంటివాళ్ళని చేసే విషయం ఏంచేశావ్? కొంచెం తీరిక చేసుకుని మంచి అపార్ట్‌మెంట్ చూడు మావయ్యా. ఆ బాధ్యత నీదే!"

'బాధ్యత'! మళ్లీ అదే బరువు! తమ విషయాలేవో మాట్లాడి ఆపింది వనజ. ఏమిటీ బతుకు నడక? బాధ్యతల వలయంలోనేనా?

"నిజానికివన్నీ నా బాధ్యతలా?" ఒక్కసారి గాఢంగా శ్వాస పీల్చుకుని, డోర్ తాళం తీసి లోపలికొచ్చాను.

మనస్సు ఉద్విగ్నంగా వుంది. నా ప్రశ్న నాకే 'హోరు'గా వినిపిస్తోంది. 'నిజానికవన్నీ నా బాధ్యతలా?' గుండె అరల్లో ప్రతిధ్వనిస్తోంది.

అభద్రతాభావం దేహాన్ని వణికించింది. చేతులు కట్టుకుని ఛాతీ మీద పెట్టుకుని కుర్చీలో కూలబడ్డాను.

ఎదురుగా టేబుల్ మీద మా కుటుంబ సభ్యుల ఫోటో. సీత చూపులు ప్రేమగా స్పర్శిస్తున్నాయి. అన్ని 'బాధ్యత'లకీ అతీతంగా ఆమె మోహంలో చిరునవ్వు! ఆ చిరునవ్వులో గోచరాగోచరంగా నా 'బాధ్యత'ల గురించి చెమరింపు!!

రోజులు గడుస్తున్నాయి.

అవును నేనింకా హైదరాబాద్ వెళ్లాల్సి వుంది!!!